క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

వీరఘట్టం: వీరఘట్టం–పాలకొండ రహదారిలో తూడి జంక్షన్ వద్ద ఎన్నికల కోడ్ పర్యవేక్షణ అధికారి ఎంవీవీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అధికారులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ మార్గంలో వచ్చిపోయే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ కంపెనీల డెలివరీ పార్శిళ్లను కూడా తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ తరలింపుపై నిఘా కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు. మద్యం, నగదు తరలిస్తూ పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అవగాహతో అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్సై సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని స్థానిక అగ్నిమాపకశాఖ ఎస్సై జామి సర్వేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని పలు కూడళ్లలో ప్రమాదాల నివారణపై డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించేందుకు అవకాశాలు అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు జరిగినపుడు ఎలా స్పందించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

నేడు కొమరాడలో ఎమ్మెల్యే ప్రచారం

కొమరాడ: మండలంలోని పరశురాంపురం, గుణానపురం, ఆర్తాం గ్రామాల్లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఇదే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కూడా పాల్గొంటున్నారని, మండల పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

అవగాహన పెంపొందించుకోవాలి



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్, నిర్లక్ష్యంగా ధూమపానం చేయడం తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు

సీతానగరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీలో వైద్యాధికారులు రోగులకు అందిస్తున్న సేవలపై వివిధ గ్రామాలనుంచి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి తెలుసుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులతో పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు ఎండఒత్తిడి కారణంగా సేద తీరే విధంగా చూడాలని, అనంతరం రోగనిర్ధారణకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యాధికారి సిఫారసు మేరకు మందులు ఇవ్వాలని సూచించారు. పీహెచ్‌సీ మందులతో వైద్యసేవలు పొందున్న వారి ఆరోగ్యభద్రతపై సిబ్బంది దృష్టి సారించి, సిబ్బంది పర్యవేక్షణలో మందులు తగు మోతాదులో వేసుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేకించి జ్వరంతో ఇబ్బందులు పడుతున్న వారినుంచి జ్వరలక్షణాలు తెలుసుకుని తప్పనిసరిగా రక్తపు పూతలు తీయాలని సూచించారు. అలాగే ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు పీహెచ్‌సీల్లో ఉన్న మందుల వాడకం, వాటికి గడువు ఉందో? లేదో? సరి చూసుకోవాలని, ఎక్స్‌పైర్ అయిన మందుల వల్ల వచ్చే అనర్థాలను ఎదుర్కొనే కన్నా ముందుగా మందుల వివరాలు, వ్యాక్సిన్ వివరాలను పరిశీలించాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం కొనసాగింపు



కొత్తపల్లిలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, మనమంతా ఆయనకు అండగా నిలవాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొత్తపల్లి, రావుపల్లి, గరుగుబిల్లి, పెద్దూరు, బురదవెంకటాపురం గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఆ తర్వాత జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ కూటమి నేతలను అస్సలు నమ్మవద్దని, అన్నివిధాలా అన్నివర్గాల ప్రజలకు మంచి చేసిన జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ఎమ్మెల్యేగా మరోసారి పోటీలో ఉన్న తనను, ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న తనూజా రాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్‌లు జి.శ్రీవేణి, బి.మహేశ్వరరావు, కె.ఇందుమతి, ఎం.నారాయణ, బి.లక్ష్మి, ఎంపీటీసీలు డి.నారాయణమ్మ, వై.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణా.. నోరు అదుపులో పెట్టుకో..

- ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెపుతారు
- నిమ్మక తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి, ఎంపీ అభ్యర్థి తనూజరాణి

పాలకొండ: పాలకొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ తీరుపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి, ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి ధ్వజమెత్తారు. పాలకొండలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ నాయకుల తీరుపై మండిపడ్డారు. జయకృష్ణను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. 2014 నుంచి టీడీపీ అధికారంలో ఉండగా ఇన్‌చార్జిగా వెలగబెట్టిన నువ్వు ప్రజలతో గెలిచిన ఎమ్మెల్యేను పక్కన పెట్టి అధికారం చెలాయించి చేసిన ఘనత ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ నియోజకవర్గానికి ఏం మేలు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. తప్పుడు ఆరోపణలు, దాడులు కూటమినాయకులకు అలవాటుగా మారాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్లు వేయడం ఆ కూటమి తీరును తెలియజేస్తోందని విమర్శించారు. మళ్లీ అధికారంలోని వచ్చేది వైఎస్సార్‌సీపీనే అని, అరుకు పార్లమెంట్ పరిధిలో పూర్తిస్థాయి మెజార్టీతో విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేశారు.

శ్రీ సీతారామ కల్యాణానికి ముహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న కాళిదాసు శర్మ

పార్వతీపురంటౌన్: ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కల్యాణం మహోత్సవం నిర్వహించేందుకు వేముకోటి వారి వీధిలో శ్రీ సర్వ మంగళా విద్యాపీఠ వ్యవస్థాపకుడు కాళిదాసు శర్మ ఇంటి వద్ద సోమవారం ముహూర్తపు రాట వేశారు. ఏటా శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ మహోత్సవానికి రాజకీయ ప్రముఖులు హాజరవుతారని కాళిదాసు శర్మ చెప్పారు. భక్తులందరూ పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు



నాడు- నిర్లక్ష్యానికి గురై గోతులతో నిండిన రోడ్డు



నేడు- ఎరుకురాయిగూడకు వేసిన పక్కా తారురోడ్డు

భామిని: దశాబ్దాలుగా గ్రామానికి సరైన రోడ్డు లేక ఎరుకురాయిగూడ గ్రామస్తులు అవస్థలు పడ్డారు. రోడ్డు వేయాలని గత పాలకులను ఎన్నిసార్లు కోరినా వారి నుంచి స్పందన లేదు. 2019లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎరుకురాయిగూడకు వెళ్లిన ఎమ్మెల్యే కళావతి గ్రామస్తుల రహదారి కష్టాలను గుర్తించి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు నిర్మాణం కోసం రూ.1.53 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో పాలవలస నుంచి ఎరుకురాయిగూడ వరకు సుమారు 1.60 కిలోమీటర్ల మేర పక్కా తారు రోడ్డు నిర్మించారు. ప్రయాణ కష్టాలు తీరడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం రేపు

సాలూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ వాసునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఒక ద్విచక్రవాహనం, నాలుగు చక్రాల వాహనాలకు పట్టణ పోలిస్‌స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఆధార్ కార్డుతో పాటు వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.



కుట్టుమిషన్ కుడుతున్న ఎమ్మెల్యే కళావతి



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఆశీర్వదిస్తున్న మహిళ

జోరందుకున్న ప్రచారం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అడుగడుగున ప్రజాధరణ
- జై జగన్ నినాదంతో హోరెత్తిన పాలకొండ

పాలకొండ: వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం జోరు పెంచారు. నియోజకవర్గ కేంద్రమైన పాలకొండ పట్టణంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి మద్దతుగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలోని నాగవంశపువీధి, బల్లంకి వీధి, కొండవీధి, జెట్టివారి వీధి, ముదునూరువారి వీధి, బాయిగట్టు వీధి, వేమకోటివారి వీధి, మార్కెట్ రోడ్డు, ప్రధాన రహదారిల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. దారిపొడవునా ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టడంతో పాటు అభ్యర్థులపై పూల వర్షం కురిపించారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతిచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పట్టణంలోని 20 వార్డుల పరిధిలో ఉన్న పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా ప్రచారం సాగింది. జై జగన్ నినాదాలతో పట్టణం హోరెత్తింది. మంగళవారం కూడా పట్టణంలో ప్రచారం కొనసాగుతుందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మిషన్ కుట్టిన ఎమ్మెల్యే..

ఎన్నికల ప్రచారంలో భాగంగా పాత ఆంధ్రా బ్యాంకు వద్ద టైలరింగ్ చేస్తున్న మహిళలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పలకరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. జగనన్న సహకారంతోనే ఈ టైలరింగ్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, తాము ఎప్పుడూ జగనన్నకు రుణపడి ఉంటామని ఆ మహిళ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి టైలరింగ్ చేయడం అందరినీ ఆకట్టుకుంది. మహిళలు సొంతంగా నిలదొక్కుకోవాలంటే జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగాలని అన్నారు.

గౌరీశంకరరావు మృతి పార్టీకి తీరనిలోటు



గౌరీశంకరరావు (ఫైల్)

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కలిసి ఆ గ్రామం వెళ్లి, గౌరీశంకరరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గౌరీశంకరరావు మృతి పార్టీకి తీరనిలోటు అని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే దంపతులు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

భామిని: జై శ్రీరామ్ నినాదాలతో చిన్నదిమిలి గ్రామం హోరెత్తింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ట, గోపుర, ధ్వజ శిఖర ప్రతిష్టోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. చిన్నదిమిలి, కొరమ, పెద్దదిమిలి, కీసర, కోసలి, కొత్తూరు, తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేదమంత్రాలతో, భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య ఉత్సవం వైభవంగా సాగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

అంగీకార పత్రాలు తీసుకోండి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి శంకరరావు

వీరఘట్టం: ఓటు ఫర్ హోం ప్రకారం 85 ఏళ్లు నిండిన వృద్ధులు, అలాగే దివ్యాంగుల నుంచి బ్యాలెట్ ఓటు వేసేందుకు అంగీకార పత్రాలను తీసుకోవాలని సెక్టోరియల్ అధికారి శంకరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ బీఎల్ఓ అప్రమత్తంగా వ్యవహరించాలని, తమ పరిధిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగుల నుంచి మంగళవారం సాయంత్రం లోగా అంగీకార పత్రాలను తీసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని సీఐటీయూ నాయకులు డి.రమణారావు కోరారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓఎంఎస్ ప్రాప్తికి జీతాలు అందించాలని, సమ్మెకాలపు జీతాలు, యూనిఫారం కుట్టు కూలి మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు పలు డిమాండ్లను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యల పరిష్కారం కాకుంటే ప్రత్యేక కార్యాచరణలో ముందుకెళ్తామన్నారు. కార్మిక నాయకులు సీహెచ్.సురేష్, సంజీవి, కార్తీక్, విమల, శ్రీదేవి, భాస్కర్ తదితరులున్నారు.

తీరిన తాగునీటి కష్టాలు

సీతంపేట: ఏజెన్సీలో బర్నగూడ గిరిజనులు తాగునీటి కోసం గతంలో అష్టకష్టాలు పడేవారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న గెడ్డల నుంచి నీటిని తెచ్చుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంచినీటి కష్టాలు తీరిపోయాయి. గ్రామంలో మినీ రక్షిత పథకం నిర్మించి వీధి కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి కష్టాలు తీరాయని మహిళలు ఆనందంగా చెపుతున్నారు. ఎమ్మెల్యే కళావతికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



నాడు- సుదూర ప్రాంతం నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు



నేడు- గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి

వలంటీర్ల రాజీనామా



గరుగుబిల్లి: రాజీనామా పత్రాలతో రావుపల్లి వలంటీర్లు



గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీవో జగదీష్‌కుమార్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న చెముడుగూడ వలంటీర్లు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పలు గ్రామాల వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. చెముడుగూడ గ్రామ సచివాలయానికి చెందిన 12 మంది, తాడికొండ సచివాలయానికి చెందిన ఇద్దరు, దుమ్మంగి సచివాలయానికి చెందిన ఆరుగురు, ఇరిడి సచివాలయం పరిధిలోని పెదఖర్జ గ్రామపంచాయతీకి చెందిన 12 మంది తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్‌కు అందజేశారు. ఇదిలా ఉండగా, బీరుపాడు సచివాలయం పరిధిలోని 10 మంది వలంటీర్లతో పాటు బాలేసు సచివాలయం పరిధిలోని 12 మంది, రాయగడ జమ్ము సచివాలయానికి చెందిన మరో 10 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల పరిధిలోని కార్యదర్శులకు అందజేశారు. తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేశామని వారు తెలిపారు.

జియ్యమ్మవలస: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 36 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. చినమేరంగి సచివాలయం నుంచి 19 మంది, గడసింగుపురం, డంగబద్ర, తురకనాయుడువలస, పిటిమండల నుంచి ఇద్దరు చొప్పున, అలమండ నుంచి మరో 10 మంది రాజీనామా చేశారు.

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామానికి చెందిన 16 మంది వలంటీర్లు రాజీనామా చేసి, తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో పి.సూర్యనారాయణకు సోమవారం అందజేశారు. అలాగే గరుగుబిల్లికి చెందిన మరో 9 మంది వలంటీర్లు సైతం రాజీనామా చేశారు.

సీతంపేట: మండలంలో పెద్దపొల్ల, టిటుకుపాయి తదితర గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 40 మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ కె.గీతాంజలికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. టీడీపీ కూటమి చేస్తున్న అసత్య ప్రచారాల వల్ల తామంతా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో తామంతా జగనన్న వెంటే ఉంటామన్నారు.

– భామిని: మండలంలోని లివిరి సచివాలయం పరిధిలో లివిరి, గజపతినగరం, అనంతగిరి, దిమ్మిడిజోల గ్రామాలకు చెందిన 20 మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. సచివాలయ కార్యదర్శి విశ్వేశ్వరరావుకు రాజీనామా పత్రాలు అందించారు. ప్రతిపక్షాలు వలంటీర్లుపై చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా రాజీనామాలు చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై సీఎం జగనన్నకు మద్దతుగా తాము పని చేస్తామని ప్రకటించారు. రాజీనామాలు చేసిన వలంటీర్లను సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణ, పార్టీ నాయకులు బౌరి త్రినాథ్ అభినందించారు.

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో సేవలందిస్తున్న 96 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు సోమవారం తమ రాజీనామా పత్రాలను అందజేశారు. యాలం నుంచి 14 మంది, గారమ్మకాలనీకి చెందిన 15 మంది, కష్పావీధికి చెందిన 20 మంది, నీలమ్మ కాలనీ నుంచి 12 మంది, వీవర్స్ కాలనీ నుంచి 10, భాసూరువారి వీధి నుంచి 17 మంది, కళామంధిర్ సచివాలయ పరిధిలో 8 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు కమిషనర్ స్పష్టం చేశారు.



పాలకొండ రూరల్: గారమ్మకాలనీ సచివాలయం వద్ద తమ రాజీనామా పత్రాలను ప్రదర్శిస్తున్న వలంటీర్లు



సీతంపేట: రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు



భామిని: కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న లివిరి వలంటీర్లు

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: గ్రామ పంచాయతీలకు సంబంధించి 2024–25 ఏడాదిలో చేపట్టనున్న అభివృద్ధి పనుల ముందస్తు ప్రణాళికలపై కార్యదర్శులు, సచివాయ డిజిటల్ సహాయకులకు సోమవారం శిక్షణ అందించారు. పాలకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో రూపొందిన ప్రణాళికల్లో చోటుచేసుకున్న లోపాలను సరిదిద్దాలని సూచించారు. ఉపాధి పనులు, వీధి దీపాలు, తాగునీటి వనరులు, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి వివరాలతో పాటు గ్రీన్ అంబాసిడర్ల జీతాలు వంటివి నమోదు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, సత్యం తదితరులు శిక్షణ అందించారు.